క్లుప్తంగా

యోగాలో సుజాతకు స్వర్ణ పతకం



స్వర్ణ పతకం అందుకున్న సుజాత

శ్రీకాళహస్తి: కర్నూలులో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన శ్రీశివసాయి యోగా సెంటర్ నిర్వాహకులు ఆయలం సుజాత ప్రతిభను ప్రదర్శించారు. ప్రథమ స్థానం దక్కించుకుని బంగారు పతకం అందుకున్నారు. ఈ క్రమంలోనే త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు సైతం ఎంపికయ్యారు.

కుంభాభిషేకానికి విరాళం



నగదు అందిస్తున్న వినుత

శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం అముదూరులో నిర్వహించే అంకమ్మ తల్లి, పోతురాజు ఆలయ మహాకుంభాభిషేకానికి జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత బుధవారం రూ.5వేల విరాళం అందించారు.

గరుడ సేవలో సర్పంచ్ కళాప్రదర్శన



పద్మావతీదేవి వేషధారణలో సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు : తిరుమలలో మంగళవారం రాత్రి నిర్వహించిన గరుడ సేవలో శ్రీపద్మావతీదేవి వేషధారణలో మండలంలోని ఎండీ పుత్తూరు సర్పంచ్ మోహనప్రియ కళాప్రదర్శన ఇచ్చారు. ఈ క్రమంలోనే శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా కళారూపంలో వేంకటేశ్వరస్వామిని సేవించుకుంటున్నట్లు తెలిపారు.

50 మందికి వస్త్రాల వితరణ



పంచె, కండువాలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 50 మంది మోత కూలీలకు నాయుడుపేటకు చెందిన రాఘవేంద్ర గ్రూప్ కనమర్ల పూడి సుబ్రమణ్యం, సురేష్ కుటుంబ సభ్యులు వస్త్రాలను వితరణ చేశారు. బుధవారం ఈ మేరకు పంచె, కండువాలను ఆలయ అధికారులకు అందించారు. అనంతరం దాతలకు అధికారులు కృతజ్ఞతలు తెలిపి స్వామి. అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

జనన శిశు యోజనపై అవగాహన



గర్భిణికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం కాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యులు మాధవుడు, శివకుమార్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోషకాహారం, సురక్షితమైన కాన్పు, జనన శిశు యోజన తదితరాలపై అవగాహన కల్పించారు.

హరియాణాలో గెలుపు చారిత్రాత్మకం



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నేతలు

శ్రీకాళహస్తి: హరియాణా ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన హ్యాట్రిక్ విజయం చారిత్రాత్మకమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అందిస్తున్న సుపరిపాలనకు నిదర్శనమే ఈ ఫలితాలని కొనియాడారు. బీజేపీ స్థానిక నేతలు మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు పాల్గొన్నారు.

వన్‌టౌన్ స్టేషన్ ముందు పని చేయని సీసీ కెమెరా



ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద నిరుపయోగంగా..



పొన్నాలమ్మ ఆలయం వద్ద విరిగి వేలాడుతున్న సీసీ కెమెరా



నిర్వీర్యం.. నిఘా నేత్రం

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పలు కేసుల పరిష్కారంలో ఆయా ఫుటేజీలు పోలీసులు ఉపయోగపడుతున్నాయి. అందుకే అర్బన్.. రూరల్ ప్రాంతాలతో సంబంధం లేకుండా నిఘా నేత్రాలు దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇదివరకు ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో పలు చోట్ల సీసీ కెమెరాలు అమర్చారు. నిత్యం సుమారు 30వేల మంది భక్తులు రాకపోకలు సాగిస్తుండడంతో భద్రతా చర్యల్లో భాగంగా వీటిని నిరంతరం పర్యవేక్షించారు. అయితే ప్రస్తుతం ఎవరూ పట్టించుకోకపోవడంతో నిర్వీర్యంగా మారిపోయాయి. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన కెమెరాలు విరిగిపోయాయి. నిఘా కొరవడడంతో ఇటీవల చోరీలు.. ప్రమాదాలు అధికమవుతున్నాయి.

- శ్రీకాళహస్తిలో పనిచేయని సీసీ కెమెరాలు
- ఎక్కడికక్కడ విరిగిపోయిన పరికరాలు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయం వద్ద గాలిగోపురం నిర్మించిన నవయుగ సంస్థ సహకారంతో 2016లో పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా చెన్నై రోడ్డు, నాయుడుపేట రహదారి, తిరుపతి మార్గంలో బైపాస్, ఎస్‌డీకే నగర్, రాజీవ్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, పానగల్, రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డ్, వీఎం పల్లె, ఎం ఎం వాడతోపాటు నాలుగు మాడ వీధుల్లో 44 కెమెరాలు అమర్చారు. తదనంతర కాలంలో వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారిపోయాయి.

కేసుల పరిష్కారంలో..

పట్టణంలో జరిగిన అనేక చైన్ స్నాచింగ్‌లు , ప్రమాదాలు, చోరీ కేసులను సీసీ ఫుటేజీల ద్వారానే పోలీసులు పరిష్కరించారు. గతంలో శ్రీకాళహస్తి ఆలయంలో ఓ దుండగుడు అనుమతి లేకుండా శివలింగం ప్రతిష్ఠించాడు. దీంతో ఇది వైఎస్సార్‌సీపీ నేతల పనే అంటూ కొందరు టీడీపీ నాయకులు బురద జల్లేశారు. రాష్ట్రస్థాయిలో రాద్ధాంతం చేసేశారు. ఈ కేసును అప్పటి సీఐ నాగార్జునరెడ్డి సీసీ ఫుటేజీ ద్వారానే పరిష్కరించారు. ఈ ఘటనకు పార్టీలతో సంబంధం లేదని, పుత్తూరు చెందిన ఓ వ్యక్తి తన మొక్కుబడి తీర్చుకునేందుకే శివలింగం ఆలయంలో పెట్టారని వెల్లడించారు.

పెరుగుతున్న చోరీలు

నిఘా నేత్రాలు ప్రస్తుతం శ్రీకాళహస్తిలో పనిచేయడం లేదు. ఈ క్రమంలోనే గత నాలుగు నెలలుగా పట్టణంలో టూ వీలర్ చోరీలు పెరుగుతున్నాయి. సీసీ కెమెరా ఫుటేజీ అందుబాటులో లేకపోవడంతో కేసుల ఛేదనలో జాప్యం జరుగుతోందని పోలీసులు సైతం వెల్లడిస్తున్నారు. నేర నియంత్రణలో కీలకమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంలో కూటమి నేతలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షసాధింపులకే టీడీపీ నాయకులకు సమయం సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎక్కడైనా నేరం జరిగితే ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలపైనే పోలీసులు ఆధారపడాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో దెబ్బతిన్న సీసీ కెమెరాలను వెంటనే రీప్లేస్ చేయాలని కోరుతున్నారు.



శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద ధ్వంసమైన సీసీ కెమెరా

‘ఉపాధి’ కింద చెరువుకు మరమ్మతు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని గాజులపెళ్లూరు కొత్తచెరువులో ఉపాధి హామీ పథకం కింద కూలీలు పూడిక తీత, కట్టకు మరమ్మతు పనులు చేపట్టారు. 150 మంది కూలీలు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. చెరువు పూడిక తీత, కట్టకు మరమ్మతులకు రూ.5 లక్షలు మంజూరైనట్లు ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణయ్య తెలిపారు. కూలీలకు రోజుకు రూ.250 గిట్టుబాటు అవుతోందని, 10 రోజుల పాటు పనులు జరుగుతాయని వివరించారు.



పూడికతీత పనులను చేస్తున్న కూలీలు

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ భారతి తెలిపారు. మంగళవారం కుక్కంబాకం, కంచనపుత్తూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో రసాయనిక మందులను వాడవలసిన అవసరం ఉండదని, పంటలు బాగా పండుతాయని వెల్లడించారు. ఆరు తడి పంటలను సాగు చేస్తే నీటి అవసరం తక్కువగా ఉంటుందని వివరించారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

జోరుగా సజ్జ పంట ఒబ్బిడి



సజ్జ ఒబ్బిడి చేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కాటూరు, పుత్తేరి, ఆలత్తూరు, వెస్ట్ వరత్తూరు, కారణి తదితర గ్రామాల్లోని రైతులు సజ్జ పంట ఒబ్బిడిని జోరుగా సాగిస్తున్నారు. కూలీలకు సైతం రోజుకు రూ.500 వరకు కూలి గిట్టుబాటు అవుతోంది. పలువురు రైతులు మాట్లాడుతూ మండలంలో సుమారు 80 ఎకరాల్లో సజ్జ సాగు చేపట్టామని, వాణిజ్య పంట కావటంతో మార్కెట్‌లో మంచి రేటు పలుకుతోందని వెల్లడించారు. ఎకరాకు అన్ని ఖర్చులు పోను సుమారు రూ.20 వేల వరకు మిగిలే అవకాశముందని వివరించారు.

ఎండీయూ ఆపరేటర్‌పై ఫిర్యాదు

వరదయ్యపాళెం : రేషన్ సరుకులను ఎండీయూ ఆపరేటర్ సుమారు 4 నెలలుగా తమ గ్రామాల్లో పంపిణీ చేయడం లేదని చిన్నపాండూరు, రాచర్ల, యానాదివెట్టు, కంచరపాళెం, అరుదూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. బుధవారం ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై వెంటనే స్పందించిన డీటీ సదరు ఎండీయూ ఆపరేటర్‌ను రెవెన్యూ కార్యాలయానికి పిలిపించి విచారణ చేపట్టారు. వాహనం మరమ్మతుకు గురి కావడంతో సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయలేకపోయానని వివరణ ఇచ్చినట్లు తెలిసింది. తక్షణమే ఇంటింటికీ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు చేపడతామని గ్రామస్తులకు డీటీ హామీ ఇచ్చారు.

డ్రిప్ పరికరాలపై అవగాహన



సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

సత్యవేడు : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్యవేడు, దళవాయి అగ్రహారంలోని రైతులకు డ్రిప్ పరికరాలపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పరికరాలు పొందేందుకు రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వరి సాగులో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ మురళి, ఎంపీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి పుష్కర మహాసంప్రోక్షణ



కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

వరదయ్యపాళెం : మండలంలోని పెద్ద పాండూరు పంచాయతీ సిద్ధేశ్వరపురం గ్రామంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి శనివారం వరకు పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు నిరంజనాచార్యులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

కిక్కు.. ఎవరిదో లక్కు!

వరదయ్యపాళెం: మద్యంప్రియులను మత్తులో ముంచి అందినకాడికి దోచుకునేందుకు అధికారికంగా రంగం సిద్ధమైంది. ఇప్పటివరకు ప్రభుత్వ పర్యవేక్షణలో అక్రమాలకు తావులేకుండా సాగిన మద్యం వ్యాపారం ఇకపై ప్రైవేట్ వ్యక్తుల దందాకు వేదికగా మారనుంది. ప్రభుత్వం ఈ మేరకు సత్యవేడు నియోజకవర్గానికి 38 మద్యం షాపులు కేటాయించింది. అందులో బీఎన్‌కండ్రిగ మండలం -10, కేవీబీపురం - 5, నాగలాపురం- 4, పిచ్చాటూరు- 4, సత్యవేడు-7, వరదయ్యపాళెం- 5, నారాయణవనం మండలంలో 3 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో మద్యం షాపులను దక్కించుకునేందుకు రాజకీయ పైరవీకారులు రంగప్రవేశం చేశారు. నేతల పేర్లు చెప్పుకుంటూ వివిధ పార్టీల చోటా నేతలు షాపులు తమవేనన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బడా వ్యాపారులు పావులు కదుపుతున్నారు. స్థానికులే కాకుండా సూళ్లూరుపేట, తమిళనాడు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సైతం మద్యం షాపుల కోసం మంతనాలు జరుపుతున్నారు.

ఈ షాపులకు భలే డిమాండ్

చిన్న పాండూరు, దాసుకుప్పం, సత్యవేడు, వరదయ్యపాళెం, పిచ్చాటూరు, కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ మండల కేంద్రాల్లోని షాపులకు ఎక్కడ లేని డిమాండ్ ఏర్పడింది. ఒక్క చిన్న పాండూరు మద్యం దుకాణానికే 30కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించడంతో మరికొంత మంది దరఖాస్తులు వేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

లాటరీ విధానంలోనే..

మద్యం షాపులను లాటరీ విధానంలోనే కేటాయిస్తాం. చాలామంది ఇప్పటికే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మరో రెండు రోజులు దరఖాస్తుకు గడువు ఉండడంతో మరింత మంది దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

– దశరథరామిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, నాగలాపురం సర్కిల్

చదువుల తల్లిగా శక్తిస్వరూపిణి










కాళరాత్రిగా అమ్మవారు , మహాసరస్వతిగా కనకదుర్గమ్మ, కనకాచల దుర్గమ్మ, చాముండేశ్వరి, స్వర్ణ సరస్వతిదేవిగా కన్యకాపరమేశ్వరి, సరస్వతీదేవి అలంకారంలో ముత్యాలమ్మ , రక్తభీజాక్షరిగా జ్ఞానప్రసూనాంబ, మాతాశ్రీ ఆశ్రమంలో అమ్మవారు

- వైభవంగా శరన్నవరాత్రులు
- సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

శ్రీకాళహస్తి : పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం వివిధ ఆలయాల్లో అమ్మవారు చదువుల తల్లి సరస్వతీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తి రక్తబీజాక్షరి, బండాసుర వధ అవతారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి, రంగుల గోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలోని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో ఉత్సవమూర్తి కాళరాత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే కనకదుర్గమ్మ సరస్వతిదేవిగా భక్తులను అనుగ్రహించారు. కనకాచలంపై కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారు ఉత్సవమూర్తి(బియ్యపు కృష్ణారెడ్డి మండపం) సరస్వతీదేవిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు స్వర్ణ సరస్వతిదేవి అలంకారంలో, బంగారమ్మ అమ్మవారు, పానగల్ గంగమ్మ, ముత్యాలమ్మ ప్రత్యేక అలంకారంలో, భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు సరస్వతిదేవి రూపంలో భక్తులను ఆశీర్వదించారు. తెట్టు ప్రాంతంలోని నల్లగంగమ్మ, విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ఏడుగంగల అమ్మవారు విశేష రూపాల్లో దర్శనమిచ్చారు.

ఏర్పేడులో..

ఏర్పేడు : మండలంలోని మర్రిమంద మాతాశ్రీ ఆశ్రమంలో శరన్నవ రాత్రుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం సరస్వతీదేవిగా రాజరాజేశ్వరీ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. చిందేపల్లెలో పార్వతీ దేవి, కోబాకలో పోలినాంచారమ్మ, ఎండీపుత్తూరు యల్లమ్మ దేవి, పాతవీరాపురం చెంగాళమ్మ దేవి, పాపానాయుడుపేట భద్రకాళీదేవి, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని ఆనందవల్లీ దేవి, కందాడు కామాక్షి దేవి అమ్మవార్లు సరస్వతీ దేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. ఆయా ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బీఎన్ కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడు గ్రామంలోని వేమలమ్మ దేవాలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సత్యవేడులో..

సత్యవేడు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సర్వమంగళదేవి తమలపాకుల అలంకరణలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త రవికుమార్ దేవర్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నాగలాపురంలో..

నాగలాపురం: సురుటుపల్లెలోని సర్వమంగళ సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అమ్మవారికి కుంకుమ పూజ చేపట్టారు. సాయంత్రం మహాభిషేకం జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తిని శివలింగమూర్తిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కారణి గ్రామానికి చెందిన బి.మాధవి, డాక్టర్ మునిరత్నం కుటుంబీకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పి.లత, సిబ్బంది పరంధామరెడ్డి, శరవణ, ప్రధాన అర్చకులు కార్తికేశన్, సతీష్‌శర్మ పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో కామాక్షీదేవి అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏసీ రెడ్డిసాగర్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ధర్మకర్త సాయిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నారాయణవనంలో..

నారాయణవనం: అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు మీనాక్షి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సర్కారు అభిషేకం నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. అలాగే కైలాసనాథకోనలోని కామాక్షాంభిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. తిరువట్యం గ్రామంలో ములస్థాన ఎల్లమ్మ వీణావాణిగా కొలువుదీరారు. స్థానిక ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవిని మధుర మీనాక్షిగా అలంకరించారు.










చిందేపల్లెలో.. ,విశేషాలంకరణలో వేమలమ్మ ,సత్యవేడులో.., విశేషాలంకరణలో మరకదాంబికై అమ్మవారు , అంబూరులో.. అన్నపూర్ణాదేవిగా.., కైలాసనాథకోనలో.. వీణావాణిగా మూలస్థాన ఎల్లమ్మ